ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 22.0



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 10 ఫిబ్రవరి 2024



మహా ప్రసాదం

స్వీకరించేందుకు పోటెత్తిన మావుళ్లమ్మ భక్తులు



మహాప్రసాదం స్వీకరించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 9 : శ్రీమావుళ్ళమ్మ ప్రసాదాన్ని స్వీకరించడానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది తరలి రావడంతో ఆలయ ప్రాంతం కిక్కిరిసి పోయింది. 28 రోజులపాటు పూజలందుకున్న శ్రీ మావుళ్ళమ్మ 60వ వార్షిక మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి ఎదుట పోసిన మహాకుంభానికి ఉదయం 7.45 గంటలకు ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. మహాకుంభాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన తర్వాత మహామంగళ హారతి ఇవ్వడంతో భక్తులు అమ్మవారి నామ జపంతో జయ జయ ధ్వానాలు పలికారు. తదుపరి సమారాధన ప్రారంభించారు. అమ్మవారి మహాకుంభంపై ఉంచిన 36 కేజీల లడ్డూను లక్షా 60 వేలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అభిమానులు దక్కించుకున్నారు. అన్న సమారాధన సందర్భంగా అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు ఉదయం 11 గంటల తర్వాత అధిక సంఖ్యలో భక్తులు రావటంతో అమ్మవారి గుడి వీధి భక్తులతో కిక్కిరిసింది. ఈసారి భక్తులను లోపలికి పంపే విధానంలో మార్పులు చేయడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ పోలీసు బందోబస్తు వున్నా భక్తులను నిలువరించలేకపోయారు. రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, ఏఎంసీ ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజి, నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం సభ్యులు కొప్పుల సత్తిబాబు, రామాయణం గోవిందరావు, రామాయణం సత్యనారాయణ, తుటారపు ఏడుకొండలు, రామాయణం చిన్నారి, కొప్పుల రంగారావు, దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, గూడూరి ఉమాబాల, తదితరులు పాల్గొన్నారు.

మాఘమాసం వచ్చేసింది..!

రేపటి నుంచి ఏప్రిల్ 26 వరకు వివాహాది శుభ ముహూర్తాలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 9 : మాఘమాసం వచ్చేసింది. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభకార్యాలకు తెరలేచింది. మంగళ వాయిద్యాల మోత మోగనుంది. మే, జూన్ మాసాల్లో మూఢమి, జూలైలో ఆషాఢం కావడంతో గడిచిన నాలుగు నెలలు శుభకార్యాలు పెద్దగా జరగలేదు. శనివారం నుంచి మాఘం మొదలు కావడంతో ఈ నెల 11 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు వరుస ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో 11, 13, 14, 15, 17, 18, 23, 24, 27, 28, 29, మార్చి 2, 3, 6, 12, 13, 15, 16, 17, 21, 22, 24, 27, 28, 29, 31, ఏప్రిల్ 3, 4, 5, 9, 12, 13, 18, 19, 20, 21, 24, 26 తేదీల్లో వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలకు మంచి ముహూర్తాలని చెప్పారు. ఏప్రిల్ 26వ తేదీ వరకు ఉన్న లగ్నాలకే ఎక్కువ మంది పెళ్లిళ్లకు మొగ్గు చూపుతున్నారు. మళ్లీ ఆగస్టు వరకు ముహూర్తాలు లేవు. దీంతో పెళ్లిళ్లకు కల్యాణ మండపాలు, బ్యాండ్ మేళాలు, పురోహితులకు డిమాండ్ పెరిగింది. రెండు నెలల క్రితమే వివాహ నిశ్చితార్థాలు చేసుకున్న వారు అప్పట్లోనే కల్యాణ మండపాలు, పురోహితులకు అడ్వాన్స్‌లు ఇవ్వడంతో ఇప్పుడు కొత్తగా లగ్నాలు నిశ్చయించుకునే వారికి మండపాల కొరత ఏర్పడింది. పురోహితుల కోసం ముదినేపల్లి ప్రాంతం వారు పక్క జిల్లాలకు వెళుతున్నారు. ఇళ్ల వద్ద దేవస్థానాల వివాహాలు చేసుకునే వారు పూల మండపాలు నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బ్యాండు మేళాలు, వీడియో గ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, క్యాటరింగ్ నిర్వహించే వారికి డిమాండ్ ఏర్పడింది. వస్త్ర వ్యాపారాలు, జ్యువెలరీ షాపులు కళకళలాడుతున్నాయి.



బోధన ఎలా ఉంది?!

- జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా విధానంపై శుక్రవారం నుంచి క్షేత్రస్థాయి తనిఖీలను డీఈవో అబ్రహం ఆదేశాల మేరకు చేపట్టారు. ఈ మేరకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయి విద్యాధికారులకు దిశ నిర్దేశం చేశారు. పాఠశాలల సందర్శనకు ఎంఈవోలు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్‌ల గెజిటెడ్ హెచ్‌ఎంలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. హైస్కూళ్లు, అప్పర్ ప్రైమరీ స్కూళ్లను ఎంఈవోలు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు, ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ గెజిటెడ్ హెచ్‌ఎంలు తనిఖీలు చేస్తారు. పారదర్శకంగా తనిఖీలు జరిగేలా విద్యాధికారులు ఇతర మండలాల్లోని (ఇంటర్ చేంజ్) పాఠశాలలను సందర్శిస్తారు. నిర్దేశించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే సంబంధిత బ్యాక్‌లాగ్‌లకు ఉపాధ్యాయుడినే బాధ్యుడిగా చేస్తూ చర్యల నిమిత్తం వివరాలను నమోదు చేస్తారు. మండలాల వారీగా తనిఖీ నివేదికలను క్రోడీకరించి పదిరోజుల్లో మరోదఫా పాఠశాలల్లో పరిశీలన చేయిస్తారు. రెండుదఫాల తనిఖీల నివేదికలను కన్సాలిడేషన్ చేసి ఓ ముసాయిదాను తయారు చేసి దాని ప్రకారమే జిల్లాలో పాఠశాలల పర్యవేక్షణ చేపడతారు.

నేడు పాఠశాలలకు పనిదినం

సంక్రాంతి సెలవులను రెండురోజులు పొడిగించిన దృష్ట్యా ఆ మేరకు ప్రత్యామ్నాయంగా తదుపరి సెలవు దినాల్లో పనిచేయాల్సి ఉంటుందని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసిన విషయం విదితమే. ఆ మేరకు ఈ నెల 10న రెండో శనివారం జిల్లాలోని అన్ని పాఠశాలలు పనిచేస్తాయని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్నికల పండగ..!



ఊరూవాడా జెండాలూ, అజెండాలు

- ఒక్కో యాత్రకు ఒక్కోపేరు పెట్టి మరీ జాతర
- సీట్లు ఖరారు కాకపోయినా జనం మధ్యే నేతలు
- ప్రజలకు చేరువగా టీడీపీ కేడరు, కన్వీనర్లు
- త్వరలోనే లోకేశ్ యువగళం యాత్ర

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ సందడే సందడి. రాజకీయం కాకెక్కింది. సవాళ్లు ప్రతిసవాళ్లు తోడవుతున్నాయి. చాటు మాటున పంపకాలు సాగుతున్నాయి. గడచిన కొద్ది రోజులుగా గ్రామాలన్నీ హోరెత్తుతున్నాయి. వీధి వీధినా దండాలు పెడుతూ... భుజం తట్టి పలకరిస్తూ.. మమ్మల్ని మర్చిపోకండని గుర్తు చేసే నాయక గణం... ఇలాంటి పలకరింపులకే ఒకొక్కరూ ఒకో పేరు పెట్టుకున్నారు. మైకుల మోత, జెండాల రెపరెపలు, అజెండాలపై రచ్చబండలు. కొన్ని చోట్ల సవాళ్లు, ప్రతి సవాళ్లు. ఇంకొన్ని చోట్ల గెలుపోటములపై ఇప్పటి నుంచే రచ్చ రచ్చ. జనం నోటా ఎన్నికల మాటే. సంక్రాంతికి ముందు నెలకొనే సందడే ఇప్పుడూ ఎన్నికల పేరిట కొనసాగుతోంది.

\- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఒకరు సిద్ధం... మరొకరు సన్నద్ధం

ఇప్పటికే దెందులూరు సమీపాన సిద్ధం పేరిట సీఎం జగన్ వైసీపీ పక్షాన ఎన్నికల శంఖారావం చేశారు. ప్రతిపక్షాలపై వాగ్బాణాలు విసిరారు. మీ జేబుల్లో పడేలా 122 సార్లు బటన్ నొక్కాను .. ప్లీజ్ నాకోసం ఎన్నికల సమయంలో రెండు బటన్లంటూ బామాలాడారు. చింతలపూడిలో రా కదలిరా పేరిట చంద్రబాబు తెలుగు దండును తట్టి లేపారు. కదన రంగంలోకి దిగి వైసీపీని గద్దె దింపాల్సిందిగా పిలుపునిచ్చారు. రానున్న రోజులన్నీ అత్యంత కీలకమని, ఏమరపాటుగా ఉండొద్దని, వైసీపీని భూస్థాపితం చేయాలంటూ జనసేన, టీడీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే అధినాయకులు ఎన్నికల ప్రచార బరిలోకి దిగి కేడర్‌ను ఎన్నికల వైపు పరుగులు పెట్టించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల పొత్తులతో రోజుకో పరిణామం చోటు చేసుకుంటోంది. తెలుగుదేశం-జనసేన ఏఏ నియోజకవర్గాల నుంచీ పోటీ చేయబోతున్నాయో ఇంకా స్పష్టత రాకముందే ఈలోపే బీజేపీ సయోధ్య మరింత సస్పెన్స్‌ను మిగిల్చింది. ఇంకోవైపు నారా లోకేశ్ యువగళం యాత్ర పేరిట జిల్లాలో మరికొన్ని నియోజకవర్గాల్లో త్వరలోనే పర్యటించబోతున్నారు. జనసేనాధిపతి పవన్ కల్యాణ్ పర్యటన ఖరారు కానుంది. ఈలోపు ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గ కన్వీనర్లు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. తమ రాజకీయ యాత్రకు తలో పేరు పెట్టుకున్నారు.

వచ్చేశాం... వచ్చేశాం

జిల్లా కేంద్రం ఏలూరులో సిటింగ్ ఎమ్మెల్యే ఆళ్ళ నాని గడప గడపకు మన ప్రభుత్వం పేరిట ఇంటింటికీ తిరుగుతున్నారు. గతంలో ఈ కార్యక్రమంలో వెనుకబడిన సిట్టింగ్‌లందరికీ అప్పట్లో సీఎం జగన్ తలంటారు. ఇలా అయితే వచ్చే సారికి సీటుండదని తెగేసి చెప్పేశారు. దీని తర్వాత కొంతలో కొంత మార్పు వచ్చింది. సిట్టింగ్ ఎమ్మెల్యే నాని ఇప్పుడు ఊరూ వాడా కార్యకర్తలను వెంటేసుకుని తిరుగుతున్నారు. తెలుగుదేశం ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బడేటి చంటి సంకల్ప యాత్ర పేరిట రంగంలోకి దిగారు. చాలా డివిజన్లలో గతం కంటే తెలుగుదేశం బలం పెరిగిందన్న సంకేతాలకు అనుగుణంగా పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు చంటిని అనుసరించడంతో తెలుగుదేశంలో జోష్ నెలకొంది. ఇదే నియోజకవర్గంలో జనసేన కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు పోరుబాట పేరిట ఇంటింటికీ తిరుగు తూ కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. దెందులూరులో ఆశీర్వాద యాత్ర పేరిట సిట్టింగ్ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఎన్నికల యాత్ర చేస్తుండగా దీనికి దీటుగా టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ పేరిట నియోజకవర్గం ఆసాంతం చుట్టేస్తున్నారు. వైసీపీకి చెందిన అనేకమందిని పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా పార్టీకి అనుకూలత పెరిగిందనే బలమైన సంకేతాలిస్తున్నారు. ఉంగుటూరు నియోజక వర్గంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు 'మన ఇంటికి మన గన్ని' పేరిట ఇప్పటికే అనేక గ్రామాల్లో ప్రజలను పలకరిస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఇదే నియోజకవర్గంలో జనసేన కన్వీనర్ ధర్మరాజు జనంలోకి జనసేన పేరిట ఎన్నికల యాత్రను కొనసాగిస్తున్నారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ, ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచార రంగంలోకి దిగాయి. చింతలపూడిలో టీడీపీ-జనసేన పక్షాన ఆకుమర్తి రామారావు, సొంగా రోషన్ కుమార్, అనిల్ బొమ్మాజీ స్థానికులతో మమేకమవుతున్నారు. తెలుగుదేశం పక్షాన మద్దతు కూడగట్టడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నారు. చింతలపూడిలో ఈ మధ్యనే జరిగిన రా కదలిరా సభలో పార్టీ అధినేత చంద్రబాబు కాస్తంత ఉత్తేజభరితంగా మాట్లాడిన ప్రభావం టీడీపీ కేడర్‌కు స్పష్టంగా వుంది. పార్టీ టికెట్ ఎవరికి అనుకూలంగా ప్రకటించినా, తామంతా ఒకటేనని సంకేతం ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, జగ్గవరపు ముత్తారెడ్డి, శ్యాం చంద్ర శేషు వంటి వారంతా ఇంకోవైపు ప్రచార వేగాన్ని పెంచారు. పోలవరంలోనూ బొరగం శ్రీనివాస్ ఇప్పటికే దఫదఫాల వారీగా మారుమూల కుగ్రామాలను కూడా సందర్శించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల వేడి మరింత పెరిగింది.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఆర్ఎం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 9 : అధికశాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే జరుగుతున్నాయని ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని ప్రజా రవాణా సంస్థ రీజనల్ మేనేజరు ఎస్.వి.ఆర్.ఎస్.కె వరప్రసాద్ అన్నారు. ఆర్టీసీ రోడ్డు భద్రత మాసం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీని ఆర్ఎం వరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. డిపో మేనేజరు డి.వాణి తదితరులు మాట్లాడారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ ఇంజనీర్ ప్రేమ్‌కుమార్, ఏఎంపీ బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలిద్దాం..



జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న డీఎల్ఎస్ఏ భవనం నుంచి ఫైర్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్, ఉప కార్మిక కమిషనర్ టి.శ్రీనివాస్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. వెట్టిచాకిరీ రహిత జిల్లాగా చేయడానికి అందరూ సహకరించాలన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం : జేసీ



ఏలూరు కలెక్టరేట్/ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 9 : వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని, క్రమశిక్షణతోనే అది సాధ్యమని జేసీ బి.లావణ్యవేణి అన్నారు. సర్.సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్టతో కలసి ఆమె పంపిణీ చేయడంతో పాటు వారిద్దరు కూడా మాత్రలు వేసుకున్నారు. జేసీ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించా లన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆల్‌బెండాజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వ రరావు, ఆర్.బి.ఎస్.కె జిల్లా ప్రోగ్రామ్ అధికారి నరేంద్ర, స్కూలు కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, డైరెక్టర్ రాజకళా శ్రీధరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు రూ. 53.59 కోట్లు

- రైతుల ఎదురుచూపులు.. రబీ పెట్టుబడులకు పాట్లు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 9 : రబీ సీజన్ ప్రారంభమైనా ఇంకా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తి చేసి ధాన్యం సొమ్ములు రైతులకు పూర్తిగా చెల్లించాల్సి ఉంది. రైతులకు రబీకి పెట్టుబడులు పెట్టేందుకు ఈ ధాన్యం సొమ్ములే ఆధారం కావడంతో వాటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ సారి మిచౌంగ్ తుఫాన్ కారణంగా సార్వా ధాన్యం కొనుగోళ్ల విషయంలో కొంత జాప్యం జరగడంతో ధాన్యం సొమ్ములు చెల్లింపు ఆలస్యమవుతోంది. జిల్లాలో ఈ ఏడాది 261 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించారు. 133 కొను గోలు సహాయ కేంద్రాల ద్వారా గత ఏడాది నవంబరు 10వ తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు జిల్లాలో 41,570 మంది రైతుల నుంచి రూ.712.17 కోట్లు విలువైన 3.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశా రు. ఇప్పటివరకు రైతులకు రూ. 657. 85 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. మిగిలిన సొమ్ము రూ.53.59 కోట్లు బ్యాంకుల వద్ద జమ చేసే ప్రక్రియలో ఉందని అధికారులు చెబుతున్నారు. ధాన్యం సొమ్ములు సకాలంలో అందితే తాము ఆర్థిక కష్టాల నుంచి బయట పడతామని రైతులు చెబుతున్నారు.

రేపటి నుంచి ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 : జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్ పరీక్షకు మొత్తం 780 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 632 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు. ఒకేషనల్ రెండోదశ, జనరల్ మొదటిదశ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెల 11నుంచి ప్రారంభమవుతాయన్నారు.



పోలీస్ గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

మొబిలేషన్‌తో వృత్తి నైపుణ్యం పెంపు : ఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలీస్ సిబ్బంది ఉద్యోగ నిర్వహణలో డీ-మొబిలేషన్‌లో నేర్చుకున్న అంశాలు ఎంతో ఉపయోగపడతాయని, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది పునఃశ్చరణ తరగతులు, డీ-మొబిలేషన్ కార్యక్రమం శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ మొబిలేషన్ కార్యక్రమం అనేది సిబ్బందికి ఉద్యోగ నిర్వహణలో చేయాల్సిన పనులను తెలియజేస్తుందన్నారు. ఉద్యోగంలో చేరే సమయంలో ఏ విధమైన తర్ఫీదు ఉంటుందో అదే విధంగా మారుతున్న కాలానుగుణంగా ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విధులు నిర్వర్తించడానికి మొబిలేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించి రాష్ట్ర డీజీపీ డెస్క్ అవార్డులు కూడా పొందారని గతంలో కంటే ఈ ఏడాది ప్రజలకు మరింత చేరువై ఎన్నికల్లో నిష్పక్షపాతంగా ఉద్యోగ నిర్వహణ నిర్వర్తించి ఉత్తమ సేవలు అందించాలన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత : ఎస్పీ

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహించారు. సిబ్బంది సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఆదేశా లు జారీ చేశారు.

ఉద్దేశ పూర్వకంగా టీడీపీ ఓట్లు తొలగించిన బీఎల్‌వోపై చర్యలు

భీమడోలు, ఫిబ్రవరి 9: భీమడోలు మండలం వడపట్ల పోలింగ్ బూత్ నెంబరు 83లో తమ పార్టీ సానుభూతి పరులైన ఆరుగురి ఓట్లను ఉద్దేశ పూర్వకంగా తొలగించారంటూ టీడీపీ ఎన్నికల అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. ఆరు ఓట్లను ఉన్నతాధికారులకు నివేదించకుండా తొలగించి, విధి నిర్వహణలో అలసత్వం వహించిన బూత్ లెవెల్ అధికారి నెర్సు దేవీ వరలక్ష్మిని ఎన్నికల విధుల నుంచి తొలగిస్తున్నట్టు భీమడోలు తహసీల్దార్ ఇ.వరాహలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

'విర్డ్' సేవలు అభినందనీయం : కలెక్టర్


కృత్రిమ అవయవాలను దివ్యాంగులకు అందించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 9: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు విర్డ్ ఆసుపత్రి చేస్తున్న సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ అన్నారు. విర్డ్ ఆసుపత్రిని శుక్రవారం ఉదయం ఆయన ఆకస్మికంగా సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందే సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రోస్టాసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను దివ్యాంగులకు పంపిణీ చేసి మాట్లాడారు. వీటిని దివ్యాంగులకు అందించడం ద్వారా వారికి నూతన జీవితాన్ని ఇవ్వడమేనన్నారు. ఏలూరు జిల్లాకు చెందిన దివ్యాంగులకు ఎవరికైనా పింఛన్ అందకపోతే తనకు తెలపాలని వారికి మంజూరయ్యేలా చర్యలు చేపడతానన్నారు. ఆసుపత్రి చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్టీలు సుధాకరరావు, నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారీ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు కృషి చేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 9 : ఎలక్ట్రికల్ రంగంలో నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం ఉందని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని గౌహతి ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ అడ్డా రవీంద్రనాథ్ తెలిపారు. ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో 'కాంప్రహెన్సీ ఓవర్‌వ్యూ ఆఫ్ యాక్టివ్ పవర్ డికాప్లింగ్ విత్ అప్లికేషన్ స్విచ్డ్ బూస్ట్ ఇన్వె ర్టర్' అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతి థిగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతీ అడుగు వారి విజయానికి మె ట్టుగా నిలవాలన్నారు. ఎలక్ట్రికల్ రంగానికి సంబంధించి దేశంలో జరుగుతున్న పలు పరిశోధనలను వివరించారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శ్రీఫణికృష్ణ, డాక్టర్ వి.సందీప్, కిరణ్ తీపర్తి పాల్గొన్నారు.

26న ఉమ్మడి పశ్చిమ జిల్లా రజక జన మహాసభ


పెదఅమిరంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

కాళ్ళ, ఫిబ్రవరి 9 : ఉమ్మడి పశ్చిమ జిల్లా రజకజన మహాసభ ఏలూరు పట్టణంలో ఈనెల 26వ తేదీన నిర్వహిస్తామని ఉమ్మడి పశ్చిమ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య తెలిపారు. పెదఅమిరంలో రజకుల చెరువువద్ద రజకుల ఫెడరేషన్ డైరెక్టర్ గోగురాజుతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న రజకులను, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదు కోవాలని కోరారు. ప్రభుత్వం రజకుల సంక్షేమానికి జీవోలు ప్రవేశపెట్టినప్పటికి కిందిస్థాయి అధికా రులు అమలుపరచకపోవడంతో సుమారు 20 లక్షల మంది రజక వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభకు అధిక సంఖ్యలో రజకులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. పెనుగుర్తి చిన్నపన్న, యండమూరి ప్రసాద్, యండమూరి సింహాద్రి, బొండాడ సింహాద్రి, సూర్యనారాయణ, మహంకాళి, చక్రవర్తి, నరేష్, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవాసవికి ఐదు పరిశోధనా కేంద్రాలు


ఉత్తర్వులు అందుకుంటున్న వాసవి యాజమాన్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 9 : పెదతాడేపల్లి శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు విభాగాలకు పరిశోధన కేంద్రాలు మంజూరయ్యాయని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జేఎన్‌టీయూకే ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు చేతుల మీదుగా పరిశోధనా కేంద్రాల మంజూరు ఉత్తర్వులను అందుకున్నట్టు ఆయన వివరించారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, విభాగాలతోపాటు ఇంగ్లీష్ విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు వీలుకలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ రత్నాకరావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ


విద్యార్థినులను విచారిస్తున్న డీఈవో అబ్రహం

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9 : విద్యార్థిను లతో అనుచితంగా ప్రవ ర్తించిన ఉపాధ్యాయు డిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో ఓ విద్యా ర్థినిపై ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించిన ఘటనపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై అధికారులు స్పందించారు. శుక్రవారం ఏలూరు జిల్లా డీఈవో అబ్రహం పాఠశాలలో పలువురు విద్యార్థిను లను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని తెలిపారు.

బాలిక కిడ్నాప్.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9:ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు నమోదైంది. ఏలూరులో ఓ ప్రాంతానికి చెందిన బాలికను శనివారపుపేటకు చెందిన గురిందపల్లి వినోద్ అనే యువకుడు ప్రేమపేరుతో నమ్మించి ఈనెల ఒకటో తేదీన తివానీ సెంటర్ వద్ద ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి కిడ్నాప్ చేసి తీసుకుపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాళీపట్నంకు కొత్త జీవోతో ఒరిగేదేమి లేదు

▸ ప్రకాశం ల్యాండ్‌లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు బాబ్జి

మొగల్తూరు, ఫిబ్రవరి 9 : కాళీపట్నం భూపంపిణీకి వైసీపీ సర్కార్ నూతనంగా తీసుకువచ్చిన జీవో నంబరు7తో భూఆక్రమణదారులకు ఒరిగేదేమి లేదని ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు మేడిద మాధవకృష్ణారావు (బాబ్జి) అన్నారు. శుక్రవారం మొగల్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ భూములకు సంబంధించి ఎస్టేట్ ఎబాలిష్ చట్టం ప్రకారం 1945 నాటికి భూమిపై సాగు చేస్తున్న రైతుల ఆధారాలను 1977 నుంచి 82 వరకు సెటిల్‌మెంట్ అధికారి అయిన నాటి జేసీ విచారణ నిర్వహించి డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ కార్యాలయానికి పంపారన్నారు. ఈ విచారణలో 910 మంది రైతులు 2,733.06 ఎకరాలకు సంబంధించి సెటిల్‌మెంట్ అధికారి వద్ద దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమయంలో నాటి తహసీల్దార్ 910 మంది రైతుల్లో 226 మంది రైతులు చూపిన హక్కుపత్రాలకు సంబంధించి 524.88 సెంట్ల భూమికి హక్కులు చెల్లవని రద్దు చేసి ఆభూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో నేటికీ ఆక్రమణదారులే సాగు చేసుకుంటున్నారు. మిగిలిన మరో 80 దరఖాస్తుదారుల ఆధారాలు చెల్లవని సెటిల్‌మెంట్ అధికారి ప్రకటించారని ఇంకా మిగిలిన 604 మంది రైతులకు గల హక్కులు సంతృప్తికరంగా లేవని ఈ భూములపై సాగు చేసేవారు ఆక్రమణదారులే కాని హక్కుదారులు కాదని బాబ్జి వివరించారు. అన్ని ఆధారాలు 1945 కటాఫ్ సమయానికి అధికారుల వద్దనే ఉండగా ప్రస్తుతం మళ్లీ విచారణ చేయడం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకేనని విమర్శిస్తున్నారు. కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసులు పొందుపర్చకుండా ఈనెల 17న ఉదయం 11 గంటలలోపు విచారణకు రావాలని అధికారులు నోటీసులు పంపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రెవెన్యూ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఈ జీవోకి సంబంధించి అధికారులు చీకటి వ్యవహారాలు చేస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తే చట్టపరంగా పోరాడతామని వివరించారు.

చేసింది రూ.2 కోట్లు.. పెట్టింది రూ.10 కోట్లు

- ఏటిగట్టు అవినీతిపై సీబీఐ విచారణ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు డిమాండ్
- నేడు పనుల పరిశీలనకు ముగ్గురు చీఫ్ ఇంజనీర్ల రాక


ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు, తదితరులు

నరసాపురం, ఫిబ్రవరి 9: 'ఏటిగట్టు పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుండడం వల్లే రెండుసార్లు కుంగిపోయింది. ఇదే వరద సమయంలో జరిగితే ప్రమాదం ఎంతపెద్దగా ఉంటుందో ఊహించడమే కష్టంగా ఉంది. పనులు మొదలుపెట్టి తొమ్మిది నెలలు గడిచింది. చేసింది 100 మీటర్లకు రూ.2 కోట్లు కూడా కాదు.. రూ.10 కోట్లు బిల్లు పెట్టి ప్రభుత్వ సొమ్మును దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు' అని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోతకు గురైన ఏటిగట్టు పనుల్ని శుక్రవారం ఆయన పరిశీలించి, ఏఈ సుబ్బారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పనులకు బినామీ ఎవరో.. మీకు తెలుసు, ముందుగా నీటిలో ఉన్న గొయ్యిని పూడ్చకుండా పనులు ఎలా చేపడుతున్నారు. ప్రారంభంలో వినియోగించిందంతా నాసిరకం రాయి, గత ప్రభుత్వం ఆ క్వారీని తిరస్కరించింది, ధర తక్కువగా ఉందని, అక్కడ రాయిని తీసుకొచ్చి పునాదుల్లో వేయడం వల్లే రెండుసార్లు కుంగింది. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ ఏఈని నిలదీశారు. పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరుగుతుందంటూ ఫిర్యాదులిచ్చాం, ఇంతవరకు స్పందన లేదు, కనీసం ఉన్నతస్థాయి అధికారులు కూడా పరిశీలించకపోవడం సిగ్గుచేటన్నారు. మీరు బినామీలకు ఇదేవిధంగా వత్తాసు పలికితే చూస్తూ ఊరుకోం, రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుంది, అప్పుడు మీ బండారం బయటపెడతామంటూ హెచ్చరించారు.

సీబీఐ విచారణ చేపట్టాలి..

మాజీ ఎమ్మెల్యే బండారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరు దున్నపోతుపై వర్షంపడినట్టుగా ఉంది, నాసిరకం పనుల వల్ల రెండుసార్లు గట్టు పడిపోయింది, కనీసం విచారణ కూడా చేయించలేదు, ఇప్పటికైనా ఈ పనులపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నమండ నాగేశ్వరరావు, చిటికెల రామ్మోహన్, ఆండ్రాజు రామన్న, అడిదెల దానియేలు, చెంపాటి సత్యనారాయణరాజు, రేవు ప్రభుదాసు, వాతాడి కృష్ణ, హేమలత, నడిపూడి కృష్ణ, రెడ్డిం శ్రీను, యర్రమిల్లి యోగి, హరి, గన్నవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు చీఫ్ ఇంజనీర్ల రాక..

గట్టు రెండుసార్లు కుంగడంతో పనులను పరివేక్షించేందుకు శనివారం ముగ్గురు చీఫ్ ఇంజనీర్లు విచ్చేస్తున్నారని ఏటిగట్టుల శాఖ ఏఈ సుబ్బారావు తెలిపారు. గోదావరి హెడ్‌వర్క్స్ చీఫ్ ఇంజనీర్ సతీష్, సెంట్రల్ డిజైన్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసయాదవ్, క్వాలిటీ కంట్రోల్ సీఈ పుల్లారావుతో పాటు ముఖ్య ఇంజనీర్లు వస్తున్నారన్నారు.

'వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి'



ఏలూరులో వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన ర్యాలీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 : జిల్లాలో వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లాలోని కార్మిక అనుబంధ శాఖల సహకారంతో 'వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనా దినోత్సవం' సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న డీఎల్ఎస్ఏ భవనం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీ చట్టరీత్యా నేరమన్నారు. వెట్టిచాకిరీ రహిత జిల్లాగా చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. ఉపకార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ ఈ సందర్భంగా వెట్టిచాకిరి నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ జి.నాగేశ్వరరావు, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కాంతిప్రియ, డీసీపీవో సూర్యచక్రవేణి, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ పలువురు పాల్గొన్నారు.

చినరంగనిపాలెంలో న్యాయవిజ్ఞాన సదస్సు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 9 :వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం ప్రకారం నిబంధనలను ఉల్లంఘించిన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎ.లక్ష్మి అన్నారు. వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ, కార్మికశాఖ సంయుక్తంగా చినరంగనిపాలెంలో ఉన్న కార్మికశాఖ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు సి.జ్వాలా శ్రీనివాస్, వీవీ సుబ్బారావు మాట్లాడుతూ కార్మికులకు అడ్వాన్సులు ఇచ్చి, వారికి కనీస వేతనాలు చెల్లించకుండా పనిలో నియమించరాదని, శుభ్రమైన తాగునీరు, వారాంతం సెలవు దినం తప్పనిసరిగా ఉండాలన్నారు. చట్టపరమైన ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. సోషల్ వర్కర్ సీహెచ్ రంగారావు, పీఎల్‌వీ కమల్‌రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్, మెడికల్ అసోసియేషన్ సభ్యులు, పలు ఇటుక బట్టీల యజమానులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

- సొసైటీ లాకర్‌లో బంగారం మాయమైన బాధితురాలు ఉమాదేవి ఆవేదన


విలేకరులతో మాట్లాడుతున్న ఉమాదేవి

తణుకు, ఫిబ్రవరి 9 : దువ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లాకర్‌లో బంగారం మాయమైన బాధితురాలు యన్నమని ఉమాదేవి న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం సొసైటీ వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ సొసైటీ 2012లో లాకర్ ప్రారంభించి అప్పటినుంచి లావాదేవీ లు జరుపుతున్నామన్నారు. ఈక్రమంలో 2018లో కుటుంబసభ్యులందరిది కలిపి 806 గ్రాముల బంగారం లాకర్‌లో పెట్టామన్నారు. అప్పటినుంచి పలు కారణాలు వల్ల అవసరం లేకపోవడంతో వస్తువులు తీయలేదన్నారు. ఈనెల 6న లాకర్ తెరచి చూస్తే వస్తువులు లేవన్నారు. అటెండర్‌తో తాళం పంపించారని తాళం తెరిచే నాటికి లాకర్‌లో వస్తువులు లేకపోవడంతో కన్నీటిపర్యంతమయ్యానని వివరించారు. బ్యాంకు సిబ్బంది కనీస మర్యాద లేకుండా చూశారని, సాయంత్రం వరకు సొసైటీ వద్ద వేచి ఉన్నానన్నారు. మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేశారన్నారు. ఈవిషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కొండేటి శివ, తిరుగుశెట్టి వెంకటేశ్వర్లు, అరిగెల బాబి, కేదారి రాము, షేక్ మస్తాన్‌వలీ, ఫైపాల నాగేశ్వరరావు, ఆలపాటి కాశి పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- వేలేరుపాడులో గిరిజన సమాఖ్య నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితుల నిరసన

వేలేరుపాడు, ఫిబ్రవరి 9 : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వ ర్యంలో ర్యాలీగా వెళ్లి వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ అధికారం చేపట్టిన వెంటనే నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తానని ఆనాడు వాగ్దానం ఇచ్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డి నేటి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కరించక పోవడం చాలా బాధాకరమన్నారు. ఎన్నికల ముందు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ప్యాకేజీలు ఇవ్వకుండా, అన్ని వసతులతో కూడిన పునరావాసం కల్పించకుండా ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారని వాపోయారు. సత్వరమే నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలనే తదితర డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, నా యకులు పిట్టా వీరయ్య, కరటం వెంకటేశ్వర్లు, యర్రా మధు, కురిమెళ్ళ వెంకటేశ్వ రరావు, మడకం సునిత, పిట్టా సాయమ్మ, పిట్టా జయ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో జాడలేని ఓటరు జాబితా

అత్తిలి, ఫిబ్రవరి 9 : అత్తిలి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తుది జాబితాను ఇప్పటికీ అందుబాటులో ఉంచలేదు. మరోవైపు ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ఓటర్లు పరిశీలించుకుని సవరణ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితానే లేదు. జాబితాలో తమ ఓటు ఉందో లేదో అని ఎలా పరిశీలించుకోవాలని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. జాబితాపై బీఎల్‌వోలను అడిగి నా సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.


పాలిలో 153వ పోలింగ్ కేంద్రం

క్రైం కార్నర్

అప్పుల ఒత్తిడితో వివాహిత ఆత్మహత్య

తణుకు, ఫిబ్రవరి9 : దువ్వ గ్రామానికి చెందిన వివాహిత మహిళ గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉంగుటూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన విజయదుర్గకు దువ్వకు చెందిన రాజేష్‌తో తొమ్మేళ్ళ క్రితం వివాహమైంది. రాజేష్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ అప్పులు పాలయ్యాడు. ఈ క్రమంలో బాకీలు తీర్చాలని పలువురు ఒత్తిడి చేయడంతో గురువారం రాత్రి విజయదుర్గ(28) ఇంట్లో తలుపులు వేసుకుని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 9 : స్థానిక రామయ్యహాలుకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. శుక్రవారం వేకువజామున సమారు మూడు గంటల సమయంలో రామయ్యహాలుకు చెందిన ఓ విద్యార్థిని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థిని ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో కారణాలు తెలియదని స్థానికులు తెలిపారు. డీఎస్పీ కె.రవిమనోహరాచారి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గోదావరి కాల్వలో పడి వ్యక్తి మృతి



భీమడోలు, ఫిబ్రవరి 9 : ప్రమాదవశాత్తు కాలుజారి ఏలూరు గోదావరి కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన భీమడోలు మండలం లింగంపాడు సమీపంలో జరిగింది. లింగంపాడుకు చెందిన పల్నాటి శ్రీను(48) ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలోపడి మృతి చెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. బంధువుల సమాచారం మేరకు భీమడోలు అగ్నిమాపక అధికారి గోదావరి కాల్వలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెదపాడు, ఫిబ్రవరి 9 :ఇంటర్ వరకు చదివిన యార్లగడ్డ రాణి తల్లిదండ్రులు లేకపోవడంతో తన తమ్ముడితో కలిసి రాజుపేట పంచాయతీ నందికేశ్వరపురంలోని పెద్దమ్మ ఇంటివద్ద ఉంటుంది. ఈనెల 7వ తేదీ తెల్లవారుజామునుంచి యువతి కన్పించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేదు. యువతి పెద్దమ్మ మట్టా సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

'ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 : బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించి, దుర్భాషలాడిన వేలేరుపాడు ఎస్ఐపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వేలేరుపాడు మండల టీడీపీ అధ్యక్షుడు అమరవరపు అశోక్ ఈ మేరకు రాతపూర్వకంగా ఫిర్యాదును అందించారు. వేలేరుపాడులో పోలీస్ స్టేషన్ కూతవేటు దూరంలో ఉన్న యర్రబోరు గ్రామానికి చెందిన కుడియం మంగ బెల్టుషాపు నిర్వహిస్తూ సారా, తెలంగాణ మద్యం విక్రయిస్తుందని అక్కడ మద్యం తాగడానికి ఈనెల 2వ తేదీన వెళ్లిన సీతయ్యతో గొడవ జరిగింది. ఈక్రమంలో సీతయ్య కుమార్తెను దుర్భాషలాడుతూ మంగ మాట్లాడింది. ఈ ఘటనపై మంగ ఫిర్యాదు మేరకు సరస్వతిని మరికొంతమందిని స్టేషన్‌కు పిలిచారు. ఆ సమయంలో ఈనెల 6న మళ్లీ రావాలనడంతో మంగ రాలేదు. ఏడోతేదీన వైసీపీ నాయకుడు కొమ్రరాజు రాంబాబు అనే వ్యక్తి మంగను తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. రాంబాబు ఎస్ఐ ముందు కుర్చీలో కూర్చుని అతనే మాట్లాడుతుండడంతో అక్కడే ఉన్న రాయుడు శ్రీను అనే వ్యక్తి ప్రశ్నించాడు. అతడిపై ఎస్ఐ ఆగ్రహించి లాకప్ ఎదురుగా మోకాళ్ళపై కూర్చుబెట్టారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల నాయకుడు అమరవరపు అశోక్, టీడీపీ నాయకులు కొమ్మన వెంకటేశ్వరరావు, సుధాకర్ కలిసి స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న వైసీపీ నాయకుడు రాంబాబు తిడుతుండగా వెంటనే వీరు ప్రశ్నించారు. ఎస్ఐ ఆగ్రహించి కానిస్టేబుల్‌తో బయటకు పంపించేశారు. మరికొంత మందిని లోపల నిర్బంధించారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు అశోక్, మరికొంత మంది కలిసి శుక్రవారం రేంజ్ ఐజీ కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా వేలేరుపాడు ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించి చట్ట ప్రకారం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తల్లీకుమారుడిపై చీటింగ్, అట్రాసిటీ కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆపై ముఖం చాటేసిన ఓ యువకుడితో పాటు అతడి తల్లిపై చీటింగ్ కేసులు, అట్రాసిటీ కేసు నమోదైంది. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన యువతి ఇంటర్ చదివి ఇంటి వద్ద ఉంటుంది. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన అంబాల సాయికిరణ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నాని పెళ్ళి చేసుకుంటానని శారీరకంగా దగ్గర అయ్యాడు. ఆ తరువాత పెద్దల ద్వారా పెళ్ళికి అడిగించగా సాయికిరణ్, అతడి తల్లి దుర్భాషలాడి కులం పేరుతో దూషించి పెళ్లికి నిరాకరించారు. బాధితురాలు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై చీటింగ్, అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకయ్య ఇంటికి విద్యుత్ మీటరు ఏర్పాటు

▸ రూ.1,11,198 బిల్లు చెల్లించొద్దని అధికారుల స్పష్టత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


దర్భగూడెంలో వెంకయ్యతో మాట్లాడుతున్న అధికారులు, స్థానికులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 9 : దర్భగూడెంలో కూలి పని చేసుకునే పిల్లెం వెంకయ్యకు రూ.1,11,198 విద్యుత్ బిల్లు రావడంతో కొద్దిరోజుల క్రితం ఆ శాఖ అధికారులు విద్యుత్ బిల్లు చెల్లించాలని ఒత్తిడి చేశారు. బిల్లు చెల్లించని కారణంగా సర్వీసు కట్ చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో విద్యుత్ శాఖ తప్పిదం దళితుడికి శిక్ష శీర్షికన శుక్రవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వినియోగదారుడు వెంకయ్య ఇంటికి వెళ్లి ఇన్‌చార్జి ఏడీ సుబ్బారావు సిబ్బందితో కలసి సమస్య పరిష్కరించారు. కొత్త మీటరు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు.

రేపటి నుంచి భీమవరం హాస్పిటల్స్‌లో

పూర్తిస్థాయి గుండె జబ్బుల వైద్యసేవలు

ఏలూరు-ఆంధ్రజ్యోతి:భీమవరం హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి గుండె జబ్బుల వైద్య సేవలను ఈనెల 11వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నా మని భీమవరం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు తెలిపారు. విజయవాడలోని రమేష్ హాస్పిటల్స్, పశ్చిమగోదావరి జిల్లాలో మల్టీ స్పెషాలిటీ వైద్య విభాగంలో ప్రఖ్యాతగాంచిన భీమవరం హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో రమేష్, భీమవరం హాస్పిటల్స్ సెంటర్ ఫర్ కార్డియాక్ సైన్సెస్ పేరుతో పూర్తిస్థాయి గుండెజబ్బుల వైద్య సేవలను ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి(బాబ్జి) హాజరవుతారన్నారు. ఇద్దరు కార్డియాల జిస్టులు, ముగ్గురు క్లినికల్ కార్డియాలజిస్టుల బృందంతో హార్ట్‌ఎటాక్, యాంజియోగ్రామ్, ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీ, పేస్‌మేకర్ హార్ట్ ఫెయిల్యూర్ రోగులకు వైద్య చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకి వస్తాయన్నారు.

అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు

పెంటపాడు, ఫిబ్రవరి 9 : పెంటపాడు డీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలలో కామర్స్ అతిథి అధ్యాపక పోస్ట్ కోసం అర్హతకల్గిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం మార్కులు సాధించడంతో పాటు పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్

▸ కిసాన్ మోర్చ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 9: కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతాంగ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహిస్తున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. శుక్రవారం ఏలూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం జరి గింది. పలువురు నేతలు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. ఢిల్లీ రైతాంగం ఉద్యమం సందర్భంగా లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించిందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, టీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఎం.నరసింహా, కె.శ్రీనివాస్, తలారి ప్రకాశ్ తదితరులు మాట్లాడారు.

ఆక్వాజోన్ పరిధిలోకి 3.50 లక్షల ఎకరాలు


మత్స్య సంపదను పరిశీలిస్తున్న మంత్రి సీదిరి

నరసాపురం, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో 3.50 లక్షల ఎకరాలను ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకొచ్చినట్టు మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అల్లూరి కల్యాణమండపంలో ఆక్వా రైతులకు ఆధునిక పద్ధతులపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ఇప్పటివరకు ఆక్వా రైతులకు సబ్సిడీపై 50,600 విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.720 కోట్లు భారం పడుతుందన్నారు. సాగులో వస్తున్న ఆధునిక పద్ధతులపై రైతులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుని డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయాలన్నారు. చీఫ్ విప్ ముదునూరి మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా అక్వాసాగు అగ్రగామిగా నిలిచిందన్నారు. తిరుమాని నాగరాజు, ఆండ్రాజు చల్లారావు, బర్రె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారిజాత గిరిలో మాస కల్యాణోత్సవం


అలంకరణలో పారిజాత గిరి శ్రీవారు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9 : గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పుష్యమాస శ్రవణానక్షత్ర సందర్భంగా శ్రీదేవిభూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో మానికల రాంబాబు మాట్లాడుతూ చొల్లంగి అమావాస్య కావడంతో స్వామిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని కల్యాణోత్సవంలో పాల్గొన్నారన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

మద్ది ఆంజనేయుడిని దర్శించిన భక్తులు


మద్దిలో శ్రీవాసుదేవ గురుస్వామి, భక్తులు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9 : శ్రీవాసుదేవ గురుస్వామి ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన 300 మంది భక్తులు మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకు న్నట్టు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. శుక్రవారం ఈవో మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల్లోని సుమారు 300 మంది భక్తులు పాదయాత్రగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనార్థం వెళుతూ మార్గమధ్యలో మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. వీరందరికి గత రాత్రి ఆలయంలో అల్పాహారం, బస ఏర్పాటు చేసి శుక్రవారం వేకువజామునే స్వామిని దర్శించుకుని, భద్రాచలం దర్శనార్థం పయనమైనట్టు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఘంటా మురళి, తదితరులు

వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగిస్తే ప్రతిఘటిస్తాం : టీడీపీ

కామవరపుకోట, ఫిబ్రవరి 9: వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే ప్రతిఘటిస్తామని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ సొంత కాంట్రాక్టర్ షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు సింగిల్ టెండర్‌పై పది రెట్లు ఎక్కువ ధరకు టెండర్ ఖరారు చేశారన్నారు. ఎన్నికల ముందే హడావుడిగా రైతులకు మీటర్లు బిగించాలని సన్నాహాలు చేస్తున్నారన్నారన్నారు. ఎన్నికల ముందు డబ్బులు డ్రా చేసుకోవడానికి వీలుగా సీఎం ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏ ఒక్క రైతుకు కూడా మీటర్లు బిగించకుండా అడ్డుకుంటామన్నారు. రైతులకు విద్యుత్ సరఫరా తొమ్మిది నుంచి ఏడు గంటలకు తగ్గిస్తూ అనధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఆ విధానం మార్చుకోవాలని సూచించారు. ఆయన వెంట గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, టీడీపీ నాయకులు రెబ్బా పరాత్పరరావు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడాలి



మాట్లాడుతున్న డీసీపీవో సూర్యచక్రవేణి

పెదవేగి, ఫిబ్రవరి 9: విద్యార్థులు భయాన్ని వీడి ముందుకెళ్తేనే విజయం వెంట వస్తుందని జిల్లా బాలల సంరక్షణాధికారి (డీసీపీవో) సీహెచ్.సూర్యచక్రవేణి అన్నారు. పరీక్షలపై చర్చ కార్యక్రమం నిర్వహణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎంసీ హైస్కూల్ వసతిగృహంలో విద్యార్థులకు పరీక్షల భయం నుంచి బయట పడడంపై సూచనలు ఇచ్చారు. సూర్యచక్రవేణి మాట్లాడుతూ చాలామంది పరీక్షలు అనగానే భయానికి గురవుతారన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి పరీక్షల్లో భయం లేకుండా చూడడమే లక్ష్యంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా ఎర్లీ ఎడ్యుకేషన్ సెంటర్ సైకాలజిస్టు డాక్టర్ బిందు, జిల్లా బాలల సంరక్షణాధికారి ఆర్.రాజేష్, కౌన్సిలర్ బాలస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న కోడూరి లక్ష్మీనారాయణ

పెదవేగి, ఫిబ్రవరి 9: బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కొప్పుల వారిగూడెం పంచాయతీ సీతాపురంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నూరు శంకర్‌గౌడ్, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, బీజేపీ నాయకులు వి.నాగ మోహన్, ఉండవల్లి వెంకట్రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీలకర్రగూడెంలో జబర్దస్త్ కళాకారుల ప్రచారం



జీలకర్రగూడెంలో జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన

కామవరపుకోట, ఫిబ్రవరి 9: ప్రజా సేవకుడిగా ఉన్న గారపాటి సీతారామంజనేయచౌదరిని ఎంపీగా ఎన్నుకుంటే అభివృద్ధి ఖాయమని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకుల బృందం జీలకర్రగూడెంలో శుక్రవారం బీజేపీ తరపున ప్రచారం చేశారు. బీజేపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 16 ఏళ్లుగా తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి సీతారామాంజనేయచౌదరి చేస్తున్న సేవలను వివరిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోద్, ఇమ్మానియేల్ హాస్యభరిత ప్రదర్శనలు చేశారు. సినీ గాయకులు లాస్యప్రియ, అరుణ్‌కౌండిన్యలు సినీ పాటలు పాడి ప్రజలను అలరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు ఏసువరప్రసాద్, మండల అధ్యక్షులు బాహుబలేంద్రుని మహేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: రంగాపురం, లింగపాలెం గ్రామాల్లో బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారులు ప్రచారం నిర్వహించారు. రాయంకుల చక్రధర్‌రావు, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, నాగేంద్రస్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపగ్రహ విజ్ఞానంపై అవగాహన కార్యక్రమం



సెమినార్‌లో పాల్గొన్న శాస్త్రవేత్త శివప్రసాద్

చింతలపూడి, ఫిబ్రవరి 9 : ఉపగ్రహాల ద్వారా విజ్ఞానం, వివిధ గ్రహాల లక్షణాలు తెలుస్తాయని విశ్రాంత శాస్త్రవేత్త ఎల్లా శివప్రసాద్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాకెట్ సైన్స్‌పై శుక్రవారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఇస్రో కార్యక్రమాలు, రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపే తీరును, ముఖ్య భాగాలను, పలురకాల ఉపగ్రహాల పనితీరును వివరించారు. ఉపగ్రహాల ద్వారా వాతావరణ పరిస్థితులు, శాంతి భద్రతలు కాపాడే ప్రయత్నంలో రాకెట్ సైన్స్ ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. సెమినార్‌లో కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎన్.జె.కె.నరేంద్రకుమార్, ఎస్.డి.మీర్‌హసం, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో ఫొటో, వీడియోగ్రాఫర్లు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9: ఫొటో, వీడియోగ్రాఫర్లకు, మిక్సింగ్ యూనిట్ వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యూనియన్ అధ్యక్షుడు కానుమూరి సోమరాజు డిమాండ్ చేశారు. డివిజన్ స్థాయి ఫొటో, వీడియో మిక్సింగ్ యూనిట్ యూనియన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. సోమరాజు మాట్లాడుతూ సబ్సిడీపై ఫొటో, వీడియో కెమెరాలు, డెస్క్ టాప్‌లు అందించాలని కోరారు. శుభకార్యాల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లే ఫొటో, వీడియోగ్రాఫర్లు హెల్మెట్ ధరించి వెళ్లాలని సూచించారు. యూనియన్ సభ్యులకు కుటుంబ భరోసా, పోస్టల్ బీమా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూరిబాబు, బాలు, కాగితాల శ్రీను, నాగసూరి బాల సుబ్రహ్మణ్యం, చింతపల్లి శ్రీను, ఫొటో, వీడియోగ్రాఫర్లు, మిక్సింగ్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు భారతరత్న రావడం గర్వకారణం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీ.నరసింహారావుకు కేంద్రం భారతరత్న ప్రకటించడం దేశానికే గర్వకారణమని బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ సమాఖ్య ద్వారా అనేకమార్లు పీవీ.నరసింహారావుకు భారతరత్న ప్రకటించాలని విజ్ఞప్తి చేశామన్నారు. గొప్ప రాజనీతజ్ఞుడు, బహుభాషా కోవిదుడు అయిన పీవీ ప్రధానిగా తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారన్నారు.

అంబికా కృష్ణ హర్షం

ఏలూరుటూటౌన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు చేసిన పీవీని విస్మరించిందన్నారు. పీవీని గుర్తించి భారతరత్న ప్రకటించటం మోదీ గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగు ప్రజలకు గర్వకారణం అన్నారు.

క్షతగాత్రులను కాపాడితే 'గుడ్ సమరిటన్' బహుమతి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కాపాడితే ప్రభుత్వం 'గుడ్ సమరిటన్' బహుమతి అందిస్తుందని రహదారి భద్రత విభాగం వైద్యురాలు జి.మౌనిక తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సెయింట్ థెరిస్సా మహిళాకళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్షించిన వారికి ప్రభుత్వం రూ.5వేలు నగదు బహుమతిని చెల్లిస్తుందని తెలిపారు. తక్షణ చికిత్స సీపీఆర్ విధానం వివరించారు. ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి మాట్లాడుతూ అతివేగం, ఫోన్లలో సంభాషణల వల్లే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ఎంవీఐలు ప్రసాద్, ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ, బస్సు డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.






పెదపాడు, లింగపాలెం, కామవరపుకోట, పెదవేగి మండలాల్లో నిరసన ప్రదర్శన, ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా..?

ఆశాల ఆగ్రహం

జిల్లాలో పలుచోట్ల ధర్నా, నిరసన ప్రదర్శన



బుట్టాయగూడెంలో రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 9: సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా.. ఆందోళన చేపడితే నిర్బంధిస్తారా అంటూ ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో పలు చోట్ల శుక్రవారం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. చలో విజయవాడ వెళ్లకుండా ఆశాలను, అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో ఆశాలు, సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సీఐటీయూ నాయకుడు సాయిబాబా మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశంగా అప్రజాస్వామిక పద్ధతిలో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తుందన్నారు. అర్ధరాత్రి ఆశాల ఇంటికి వెళ్లి అరెస్టు చేసి నిర్బంధించడం బాధాకరమన్నారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో విజయ, లోకేశ్వరి, సునీత, ప్రియాంక, వరలక్ష్మి, ప్రమీల, కమలా, కల్యాణి, మురళీ, పాల్గొన్నారు.

● పెదపాడు: ఆశా కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అప్పటి వరకూ విధులు బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం సెంటరులో రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● పోలవరం: ఉద్యోగ భద్రత కోరిన ఆశా వర్కర్లపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ మండల కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. కుసుమ కుమారి, బీరా రత్నాజీ, గోకా అరుణ, బి.రామలక్ష్మి, సీహెచ్.బంగారులక్ష్మి, సీహెచ్.సత్య రామలక్ష్మి, బి.సుహిత, పీకే.సత్యవతి, బి.జయలక్ష్మి, బి.కుమారి తదితరులు పాల్గొన్నారు. ఆశా వర్కర్లకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. మంగిన కొండ, యడ్ల వినోద్, ఆకుల రాజా, మేడుం పార్వతి, పట్నాల దేవి తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని కె.గోకవరం, ధర్మాజీగూడెం, లింగపాలెం పీహెచ్‌సీల పరిధిలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. అరెస్ట్ చేసిన సీఐటీయూ నాయకులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆశావర్కర్లను హౌస్ అరెస్ట్, నిర్బంధంతో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా కార్యక్రమంలో మేరుగు ఏసమ్మ, భాగ్యలక్ష్మి, సుజాత, అవ్వమ్మ, వెంకటేశ్వరమ్మ, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదవేగి: ఆశా వర్కర్ల చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదవేగి పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేపట్టారు. సమస్యలను తక్షణం పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా కార్యకర్తలు రోజా, సత్యవతి, స్వాతి, తులసి, కృష్ణకుమారి, వల్లీ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: ఆశా వర్కర్లను హౌస్ అరెస్ట్, సీఐటీయూ నాయకుల అరెస్టుపై పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన ఆశాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నూజివీడు సీఐని సస్పెండ్ చేయాలి

ఏలూరు టూటౌన్: ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులపై దౌర్జన్యంగా వ్యవహరించిన నూజివీడు పట్టణ సీఐను తక్షణం సస్పెండ్ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్ల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, నరసింహ డిమాండ్ చేశారు. నూజివీడులో గురువారం ఆశాలను నిర్బంధించి, దౌర్జన్యంగా వ్యవహరించిన సీఐపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






పెదపాడు, జంగారెడ్డిగూడెం, పెదవేగి, భీమడోలు పాఠశాలల్లో చిన్నారులకు నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు

నులి పురుగులతో రక్తహీనత

పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు

పెదవేగి, ఫిబ్రవరి 9: నులి పురుగులతో రక్తహీనతతో పిల్లలు అనారోగ్యం పాలవుతారని ఎంపీపీ తాతా రమ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులి పురుగుల కారణంగా ఆకలి మందగించి ఎదుగుదల లోపిస్తుందన్నారు. ప్రభుత్వం ఆరునెలలకోసారి నులి పురుగుల నివారణ మాత్రలను పిల్లలకు పంపిణీ చేస్తోందని ఆమె చెప్పారు. ఏఎన్ఎం మౌనిక, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదపాడు: పీహెచ్‌సీలో పరిధిలో పాఠశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ చక్రధర్ మాట్లాడుతూ పిల్లలు, కిశోర బాలల కడుపులో నులి పురుగులు ఉంటే పోషకాహార లోపం, రక్తహీనతతో శారీరక, మానసిక ఎదుగుల లోపాలను కలిగి ఉంటారన్నారు. వీటి నివారణకు అల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రను వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: తాడువాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాతరలను అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు ఎం మనోజ్ఞ తెలిపారు. హెచ్ఎం ఆర్.నాగదుర్గారావు, ఏఎన్ఎం ఎం.వనితా జ్యోతి, ఎ.సరస్వతి, ఉపాధ్యాయురాలు పి.ఎలీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెం, కె.గోకవరం, లింగపాలెం పీహెచ్‌సీల పరిధిలో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు వారికి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. బాలబాలికలకు ఈ మాత్రలు అందజేస్తున్నామన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు, డాక్టర్ యానీప్రీతి, డాక్టర్ ప్రదీప్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● టి.నరసాపురం: నులి పురుగు నివారణతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి జె.కల్పనారాణి తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులి పురుగులు వలన అనారోగ్య సమస్యలలో పాటు రక్తహీనత ఏర్పడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: పీహెచ్‌సీ పరిధిలో పలు పాఠశాల విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో సర్పంచ్ పాము సునీత మార్సింగ్ విద్యార్థులకు టాబ్లెట్లను వేశారు. యలమర్తి రవీంద్ర కుమార్, మురళి, శ్రీనివాస్, చంద్రకళ, నాగదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ప్రతీ ఒక్కరు నులిపురుగు మందు వేసుకోవాలని మలేరియా జిల్లా అధికారి డాక్టర్ సురేష్ సూచించారు. బయ్యన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల్లో పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అనంతలక్ష్మి, వైద్యాధికారి సత్యనారాయణ, స్థానిక సిబ్బంది ఉన్నారు.

● కుక్కునూరు: పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలో 19 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సర్పంచ్ రావు మీనా, రావు వినోద్, ఆశవర్కర్లు, సచివాలయం ఇబ్బంది పాల్గొన్నారు.

ఆటోలకు ఈ-చలనాలు రద్దు చేయాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 9: ఆటో, ట్యాక్సీలపై ఈ-చలానాలు రద్దు చేయాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో గోపి మాట్లాడుతూ నగరంలో సెన్సార్ కెమెరాలను సరైన దిశలో అమర్చలేదన్నారు. ట్రాఫిక్ పోలీసులు అడ్డగోలుగా ఈ చలానాలు రాస్తున్నారన్నారు.ఈ-చలానాలు రద్దు చేయ్యని పక్షంలో ఫిబ్రవరి 12నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూరిబాబు, లింగరాజు, అమర్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రుణాలు మంజూరు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: దివ్యాంగులకు తక్కువ వడ్డీతో జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ నలుగురికి రుణాలు మంజూరు చేసిందని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. జేసీ ఛాంబర్‌లో ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ జిల్లా మేనేజరు, విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడీ రాకాడమణి ఆధ్వర్యంలో రూ.19 లక్షల చెక్కులను లబ్ధిదారులకు జేసీ శుక్రవారం అందజేశారు. జీవనోపాధి నిమిత్తం రూ.4.75లక్షల చొప్పున రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బస్టాండ్ నుంచి మసీద్ సెంటర్ వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎ.కేశవ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) వరలక్ష్మి, ఉద్యోగ సంఘాల నాయకులు, గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ ఖర్చుతో పాఠశాలలో ఉపాధ్యాయుడు

కుక్కునూరు, ఫిబ్రవరి 9: పరీక్షలు సమీపిస్తున్నాయి.. ఉపాధ్యాయుడే లేని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి తెలుసుకున్న కుక్కునూరు సర్పంచ్ రావు మీనా వినోద్ 9, 10వ తరగతులకు భౌతికశాస్త్రం బోధించే టీచర్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో టీచర్‌ను ఏర్పాటు చేసి పరీక్షలు అయ్యే వరకు తానే ఖర్చు భరిస్తానని తెలిపారు. విద్యార్థుల భవిషత్‌ను దృష్టిలో ఉంచుకొని టీచర్‌ను ఏర్పాటు చేశామని, మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయ సందర్శనతో విజ్ఞానం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 9: గ్రంథాలయాల్లో లక్షలాది పుస్తకాలు చదివిన బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అయ్యాడని, ఆయన ఆదర్శంగా ప్రతి ఒక్కరు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఐడియా జాతీయ అధ్యక్షుడు జీ.రాజసుందర్‌బాబు అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థల కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంతో ముందుకు సాగాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, సహాయ కార్యదర్శి జుల్ఫికర్ ఆలీ, ఏపీ ఎన్‌జీవోస్ జేఏసీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్.హరినాథ్, ఎన్‌జీవో సంఘం జిల్లా కార్యదర్శులు కప్పల సత్యనారాయణ, నెరుసు రామారావు, జీ.శ్రీధర్, న్యాయవాది జీవీ కృష్ణారావు, రాజు తదితరులు ప్రసంగించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు

చింతలపూడి, ఫిబ్రవరి 9: బాలలను కర్మాగారాలు, పొలాల్లో రోజువారి కూలీలుగా పనిలో పెటుకుంటే శిక్ష, జరిమానా తప్పదని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తెలిపారు. వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రైవేటు స్కూలులో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్లలోపు పిల్లలు విధిగా చదువుకోవాలన్నారు. ఎక్కడైనా పనుల్లో పిల్లలను గుర్తిస్తే చైల్డ్‌లైన్ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. న్యాయవాదులు డేవిడ్‌రాజు, ఎం.డి.అక్బర్ ఆలీ పాల్గొన్నారు.

పీఆర్టీయూ నాయకులకు ఓడీ సౌకర్యం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9: పీఆర్టీయూ నాయకులకు ఆన్‌డ్యూటీ (ఓడీ) సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వ కార్యదర్శి పోలా భాస్కర్ శుక్రవారం జీవో 320 ఉత్తర్వులు జారీ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు వివరాలు తెలిపారు. సంఘ ఆవిర్భావ రోజునే ఓడీ ఉత్తర్వులు వెలువడడం హర్షణీయమని, ఈ సౌకర్యంతో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి మరింత అవకాశం వచ్చినట్టయిందన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

భీమడోలు, ఫిబ్రవరి 9: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సెట్వెల్ సీఈవో ఎండి మెహరాజ్ అన్నారు. గుండుగొలను జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజయ్‌కుమార్, కెనడి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెదవేగి, ఫిబ్రవరి 9: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. తహసీల్దారు ఎం.సూర్యప్రభ మండలంలో పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు సౌకర్యాలు పరిశీలించారు. సర్వేయర్ సత్యనారాయణమూర్తి, కొప్పాక వీఆర్వో ఝాన్సీ, సచివాలయ సర్వేయర్లు, బీఎల్వోలు ఉన్నారు.

● ఉంగుటూరు: పోలింగ్ కేంద్రాలలో వసతులను మండల అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ వెంకట శివయ్య, ఎంపీడీవో శర్మ, ఎస్సై ఎ.మణి కుమార్, బీఎల్‌వోలు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు పరిశీలించారు.

ఓటర్ జాబితాల పరిశీలన

టినరసాపురం, ఫిబ్రవరి 9: ఓటర్ జాబితాలో తేడాలుంటే చర్యలు చేపడతామని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. మండలంలోని అప్పలరాజు గూడెంలో పోలింగ్ బూత్ నెంబర్ 63, 64లలో ఓటరు జాబితాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కొన్ని తేడాలను గుర్తించామని తెలిపారు.

బాధిత కుటుంబానికి టీడీపీ నేత సాయం



నగదు అందజేస్తున్న రోషన్‌కుమార్

లింగపాలెం, ఫిబ్రవరి 9: లక్ష్మీగణపతినేనివారిగూడెంలో కుక్కకాటు మృతుడి కుటుంబానికి టీడీపీ నాయకుడు సొంగా రోషన్ కుమార్ శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల గ్రామంలో కుక్కకాటుతో మృతిచెందిన పిట్టా సాత్విక్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. సాత్విక్ కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట కాకర్ల శివరావు, రాచపూడి వెంకటేశ్వరరావు, వెంపా మురళీ, మాజీ ఎంపీటీసీ కర్లపూడి రామారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 9: ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కాపు నాయకుడు దాసరి రాము కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ జనసేన పార్టీలు సమన్వయంతో ముందుకు వెళుతున్నాయని, అధికార పార్టీ విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసే అవకాశం ఉందన్నారు. డబ్బు ప్రలోభపడకుండా నిజాయితీగా ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





భీమడోలులో మాట్లాడుతున్న గన్ని, జంగారెడ్డిగూడెంలో టీడీపీ నేతలు, అప్పనవీడులో టీడీపీ, జనసేన జెండాలు ఆవిష్కరిస్తున్న చింతమనేని

టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలి : గన్ని

భీమడోలు, ఫిబ్రవరి 9 : జనసేన, టీడీపీ కూటమిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు శిరిబత్తిన కొండబాబు శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే యువత భవిష్యత్ బావుంటుందని సూచించారు. మన ఇంటికి మన గన్ని కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● పెదపాడు: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధిస్తుందని, నియంత పాలనకు మరో రెండు నెలల్లో ప్రజలు చరమ గీతం పాడనున్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అప్పనవీడులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గాంధీనగర్‌లో టీడీపీ, జనసేన జెండాలను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉండే వ్యక్తి చింతమనేనికి జనసైనికులు పూర్తి అండగా నిలబడాలన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సోషల్ మీడియాను దీటుగా ఎదుర్కోవాలి

ఏలూరు టూటౌన్: తెలుగుదేశం పార్టీ, కార్యకర్తలు, నాయకులపై వైసీపీ సోషల్ మీడియా విపరీతమైన ట్రోల్స్ చేస్తుందని, అంతే దీటుగా ఎదుర్కోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. బడేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో చంటి మాట్లాడుతూ వాస్తవాలను వక్రీకరించి వైసీపీ సోషల్ మీడియా బురద చల్లుతుందన్నారు. అలాంటి వాటికి సోషల్ మీడియాలో ధీటుగా సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుగ్గన బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు

బుట్టాయగూడెం: బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీ తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పన్నులు, బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు లేదన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి స్కీమ్‌లో స్కామ్ ఉందన్నారు. ధరల పెంపు, పన్నుల భారం, కరెంట్, రిజిస్ట్రేషన్ చార్జీలు ప్రజలకు భారంగా మారాయన్నారు. అవినీతి పాలన ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నట్లు తెలిపారు.

నేడు జయహో బీసీ కార్యక్రమం

జంగారెడ్డిగూడెం టౌన్: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రావూరి కృష్ణ, మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, బీసీ నాయకుడు రాజాన సత్యనారాయణ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జయహో బీసీ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొనాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు లయన్స్ ప్రతినిధి మానేపల్లి రామారావు తెలిపారు.
- జనసేన ప్రజా పోరాటాలతో ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై అసంతృప్తి నెలకొందని, దీనితో తమ పార్టీపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని జనసేన నగర అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేష్ అన్నారు. సరిది రాజేష్, వీరంకి పండు, బొత్స మధు, తదితరులు ఉన్నారు.
- **బుట్టాయగూడెం :** కార్మికుల సమస్యల పరిష్కారానికి గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో దొరమామిడిలో ప్రచారం చేశారు. టి.బాబురావు, బి.వినోద్ పాల్గొన్నారు.
- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు, మందులు అందించడం జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం తెల్లంవారిగూడెంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.
- **ఉంగుటూరు :** మానవత ఆధ్వర్యంలో గణపవరం మీనాక్షి నేత్రాలయ సహకారంతో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ బండారు సింధు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, గంజి రవి, కోనే సత్యనారాయణ, పాతూరి వంశీ, దొంతంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- చేబ్రోలు ఎస్ఐగా పని చేసిన కాశిస్వామి దంపతులకు నిడమర్రు సర్కిల్ ఆధ్వర్యంలో వీడ్కోలు సత్కార సభ నిర్వహించారు. సీఐ మోగంటి వెంకట సుభాష్ ఆయన సేవలను కొనియాడారు. చేబ్రోలు, నిడమర్రు, గణపవరం ఎస్సైలు ఏ.మణి కుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం నారాయణపురం వేంకటేశ్వర స్వామి ఏకాదశ కల్యాణోత్సవం శనివారం ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ తెలిపింది. 11న స్వామి కల్యాణం, 13న ఊరేగింపు, 16న అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ వివరించింది.







నూజివీడు, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, ముసునూరులో మాత్రల పంపిణీ

నులి పురుగుల నిర్మూలనతోనే..
రక్తహీనతకు చెక్

నూజివీడు, ఫిబ్రవరి 9: నూజివీడు త్రివిధ పాఠశాలలో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహన్ ప్రారంభించారు. సుమారు 2 వేల మంది విద్యార్థులకు మాత్రలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత పోవాలన్నా తిన్న ఆహారం శరీరానికి అందాలన్నా నులిపురుగుల నివారణ అవసరమన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: జాతీయ నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకుని ఆల్బెండాజోల్ మాత్రలను దిగవల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఎం.శ్రీనివాస్ పంపిణీ చేశారు. నూజివీడు మండల వ్యాప్తంగా 7083 మంది విద్యార్థులకు గాను తొలిరోజు 80 శాతం మంది విద్యార్థినీ విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశామని, ఈనెల 16వ తేదీ వరకు విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. సీహెచ్‌వో షేక్ దావల్బీ, ఏఎన్‌ఎం కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ షకీలా ఇవాంజిలిన్ గురుకుల పాఠశాలలోని బాలికలకు నులి పురుగుల నివారణ మాత్రలను వేయగా, డాక్టర్ కరీముల్లా రమణక్కపేట జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. మండలంలో 4,803 మంది విద్యార్థులు ఉండగా, 4,697 మంది విద్యార్థులకు మాత్రలు వేసి 97 శాతం లక్ష్యాన్ని సాధించినట్టు వైద్యులు తెలిపారు. డాక్టర్ భవానీ, డాక్టర్ అవినాష్, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఈదులగూడెం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. నందు బాలబాలికలకు నులిపురుగుల ట్యాబ్‌లెట్లను వేయటం జరిగింది. సచివాలయ కన్వీనర్ నందూరి భాస్కర్‌ప్రసాద్, హెచ్‌ఎంలు ఎం.సీతాదేవి, తాడి ప్రసాద్, ఈదులగూడెం విలేజ్ హెల్త్‌క్లినిక్ పర్యవేక్షకురాలు ఎం.దీపిక, ఏఎన్‌ఎమ్ కె.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: శుక్రవారం కలిదిండి విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు వైద్యాధికారులు జాహ్నవి సాయి సుచిత, హేమంత్‌లు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల రక్తహీనత ఏర్పడుతుందన్నారు. కలిదిండి మండలంలో మొత్తం 4,536 మంది విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు ఇతరులకు 92 శాతం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కైకలూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. శుక్రవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాత్రల పంపిణీని ప్రారంభించారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఆటపాక సర్పంచ్ తలారి మణిమ్మ, ఉప సర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, వైద్యాధికారులు డాక్టర్ శంకర్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముదినేపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శాంతి శ్రీ, డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించి మందులు వేశారు. ముదినేపల్లి, పెదగొన్నూరు, బొమ్మినంపాడు, అల్లూరు, కాకరవాడ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో వారు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి శ్యామలాంబ నవరాత్రులు



కైకలూరు, ఫిబ్రవరి 9: కైకలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారికి శనివారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు శ్యామలా నవరాత్రి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో వీఎన్‌కె శేఖర్ తెలిపారు. ఈ నవరాత్రుల్లో అమ్మవారు ప్రతిరోజు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారని భక్తులు దర్శించుకోవాలని కోరారు. శనివారం అమ్మవారు లఘు శ్యామలగా దర్శనమిస్తారని, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుర్రం రాంబాబు, ధర్మకర్తలమండలి ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి బీజేపీ పల్లెకు పోదాం

ముదినేపల్లి, ఫిబ్రవరి 9 : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం నుంచి కైకలూరు నియోజకవర్గంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమ ఏలూరు జిల్లా ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ కోటప్రోలు కృష్ణారావు తెలిపారు. శనివారం ఉదయం కార్యక్రమాన్ని ముదినేపల్లిలో ప్రారంభిస్తామని, నియోజకవర్గంలో మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు.

పీవీకి భారతరత్న తెలుగువారందరికీ గర్వకారణం

కైకలూరు, ఫిబ్రవరి 9: మాజీ ప్రధానులు చరణ్‌సింగ్, పీవీ నరసింహారావు, హరితవిప్లవ పితామహుడు స్వామినాథన్‌లకు భారతరత్న ప్రకటించడం అభినందనీయమని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీ నాయకులు వేంపాటి విష్ణురావు, కోటప్రోలు కృష్ణారావు, కట్టా వీరరాఘవులు, నంబూరి విజయ నరసింహరాజు, సమయం ఏసుబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న తెలుగువారందరికీ గర్వకారణమన్నారు.



అటపాకలో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎస్‌ఈ సత్యనారాయణ

తాగునీటి ఎద్దడిని నివారిస్తాం

కైకలూరు, ఫిబ్రవరి 9: తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. ఈ నెల 4న 'ప్రమాద ఘంటికలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం కైకలూరు మండలం ఆటపాక, గోనెపాడు, కలిదిండి మండలం కోరుకొల్లు తదితర గ్రామాల్లో మంచినీటి చెరువులను పరిశీలించారు. అనంతరం కైకలూరులో విలేకర్లతో మాట్లాడుతూ కైకలూరు, కలిదిండి మండలాల్లో 30 గ్రామాల్లో మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటిపోయిందని కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో శివారు గ్రామాలకు తాగునీరు అందడం లేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేసి గ్రామాల్లో తాగునీటి ఎద్దడిపై పూర్తిస్థాయిలో వివరిస్తానన్నారు. అప్పటివరకు గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా నీరందేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కైకలూరు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాస్త్రి, ఏఈలు బి. నాగబాబు, కృష్ణారావు, ఈవోపీఆర్డీ రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వైవాక చెర్వు నుంచి నమూనాల సేకరణ

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 9: ఈ కాల్వల నుంచే తాగునీరు? శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మండలంలోని వైవాక తాగునీటి చెరువును వైద్య బృందం సందర్శించి నీటి శాంపిళ్లను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మహిళలు చెరువులో త్రాగునీటిని ఉపయోగించలేకపోతున్నామని పంచాయతీ అధికారులు రొయ్యల చెరువు నుంచి పంట కాలువలకు వచ్చే నీటిని తాగునీటి చెరువులోకి ఇంజన్ ద్వారా పెడుతున్నారని ఆ నీటిని తక్షణం తొలగించి చెరువులోకి పంట కాలువ నుంచి వచ్చే స్వచ్ఛమైన నీటితో నింపాలని విన్నవించారు. పంచాయతీ కార్యదర్శిని అదేమని ప్రశ్నిస్తే నీటి శాంపిల్స్ తీసుకువెళ్ళిన తరువాత పరిశీలిస్తామంటున్నారని వాపోయారు.

నేత్రదానం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 9: నేత్రదానంతో మరికొందరికి చూపునిచ్చే అవకాశం కల్పించవచ్చని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్‌పర్సన్ పి.కృష్ణప్రసాద్ అన్నారు. నూజివీడులో దొడ్డా సరోజిని మృతి అనంతరం ఆమె నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు అందించారు. ఈ నేపథ్యంలో లయన్స్ క్లబ్ తరపున సరోజిని కుటుంబసభ్యులను అభినందిస్తూ ఐ డొనేషన్ సర్టిఫికెట్‌ను కుటుంబసభ్యులకు అందించారు. కుమార్ విద్యా సంస్థల చైర్మన్ పీవీ కుమార్, ఏఎస్సై కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



కబ్జాదారులపై కేసులు నమోదు చేయండి

కైకలూరు, ఫిబ్రవరి 9: ఎస్సీ, ఎస్టీల భూములను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాచపట్నంలో జోసఫ్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆక్రమణకు గురైన అతని భూమిని పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలంలో కట్టడాలు నిర్మించిన వ్యక్తులతో మాట్లాడి బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్ ఎస్. పోతురాజుకు సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు, టౌన్ సీఐ ఆకుల రఘు, ఏఎస్‌డబ్ల్యూ నాగమణి, సర్పంచ్ అల్లూరి మంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలి

ముదినేపల్లి, ఫిబ్రవరి 9 : పాఠశాలల నిర్వహణ, బోధన విషయంలో ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ముదినేపల్లి ఎంఈవో సేవ్యా తెలిపారు. శుక్రవారం మండలంలోని పెయ్యేరు ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును, నాడు - నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల భవనాన్ని కూడా తనిఖీ చేశారు. హెచ్‌ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నిలిచిన ట్రాఫిక్‌తో వెతలు

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 9:సింగరాయపాలెం నాలుగురోడ్ల కూడలిలో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నిత్యం ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బందిని తొలగించడంతో కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వాపోయారు. దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న బస్సుల్లో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. తక్షణం పోలీసులు స్పందించి ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

యువకుడి అనుమానాస్పద మృతి

మండవల్లి, ఫిబ్రవరి 9: మండవల్లి మండలం కాకతీయనగర్ వద్ద రొయ్యల చెరువుపై వాచ్‌మన్‌గా పనిచేస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మండవల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కైకలూరు గ్రామానికి చెందిన కమ్మిలి శివప్రసాద్‌కు చెందిన కాకతీయ నగర్‌లోని 6 ఎకరాల (లీజు చెరువు) రొయ్యల చెరువుపై దోనిపాటి అబ్రహం(26) అబ్రహం నెల జీతానికి పనిచేస్తున్నాడు. శుక్రవారం చెరువుగట్టుపై షెడ్డులో ఉరి వేసుకుని అబ్రహం మృతి చెందినట్లు గుర్తించిన యజమాని కమ్మిలి శివప్రసాద్ మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మండవల్లి ఎస్సై సీహెచ్ రామచంద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా వర్కర్ల నిరసన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వ దాడిని ఖండిస్తూ నూజివీడు పట్టణంలోని కోనేరుపేట పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. సీఐటీయూ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆశా యూనియన్ నాయకులు కమల, నాగమణి, స్వాతి, రాధాకుమారి, పావని, నాగలక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: తమకు విశ్రాంతి లేకుండా పనిచేయిస్తున్నారని పని ఒత్తిడి ఎక్కువ అవుతోందని, ఆశావర్కర్లు నిరసన తెలిపారు. పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తలు, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కావాలని, గౌరవవేతనం వద్దని, కనీసవేతనం కావాలని కోరారు. నీలాంబరి విజయ్‌కుమారి, అమృతసునీత, సీఐటీయూ నాయకులు రాజులపాటి చంటి, సత్తు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు అర్బన్ పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్ల నిరసన



నూజివీడులో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ముద్దరబోయిన



లింగాలలో బాబు ష్యూరిటీలో టీడీపీ, జనసేన నాయకులు

టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లు

నూజివీడు, ఫిబ్రవరి 9: టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో భవనాలను పంపిణీ చేస్తామని, రుణాలు తీసుకునేలా చేసి లబ్ధిదారులను అప్పుల ఊబిలో ముంచిన స్థానిక ప్రజాప్రతినిధుల నుంచే సంబంధిత రుణాల వడ్డీ వసూలు చేయాలని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు 1వ వార్డులోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడుతూ ఇళ్ళు ఇస్తానని నమ్మించి ఇవ్వలేకపోయినందుకు సంబంధిత రుణాలు శాసనసభ్యుడే కట్టాలని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు తమ సంక్షేమం కోసం ఎవరు పాటుపడుతున్నారో గుర్తించి వారికి అండగా నిలవాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే టిడ్కో భవనాల లబ్ధిదారులకు జీ+3 పూర్తి ఉచితంగా ఇచ్చేందుకు కృషిచేస్తానని, అలాగే ఎమ్మార్ అప్పారావు కాలనీలో రహదారులు, డ్రైనేజి వ్యవస్థ మెరుగుకు, పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతానన్నారు. ఆయన వెంట నూజివీడు పట్టణ నాయకులు జీవి రామారావు, మాజీ కౌన్సిలర్లు గొల్లుదుర్గాదేవి, విజయ, పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జ్ మండా శ్రీనివాసరావు, పురపాలక ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు నూతక్కి వేణు, రూరల్ అధ్యక్షుడు రాజా, రాజశేఖర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రాజశేఖర్, మండల రైతు నాయకుడు వెంకటరెడ్డి, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళా నాయకురాలు నజీమ, కౌన్సిలర్లు దాసరి స్వామి, యార్లగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వస్తేనే భవిష్యత్

మండవల్లి: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు ఉంటుందని లేకుంటే అంతా అంధకారమేనని టీడీపీ శ్రేణులు కోరాయి. లింగాలలో టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ హామీ పత్రాలను ప్రజలకు అందజేశారు. టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, క్లస్టర్ కూనపురెడ్డి కోటేశ్వరరావు, పార్టీ కైకలూరు మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, బోయిన సురేష్, టీడీపీ నాయకుడు వీరాబత్తిన సుధ, గ్రామ అధ్యక్షుడు చిట్టిబొమ్మ నాగేశ్వరరావు, పోలగాని శ్రీరామమూర్తి, పోలగాని నాగేశ్వరరావు, కానగాని అంకినీడు, దుద్దుకూరి కాశీ, ఓరుగంటి పోతురాజు పాల్గొన్నారు.




కైకలూరు, నూజివీడు సదస్సుల్లో మాట్లాడుతున్న న్యాయాధికారులు

వెట్టి రహిత సమాజాన్ని నిర్మించాలి

కైకలూరు, ఫిబ్రవరి 9: వెట్టిచాకిరి రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. శుక్రవారం వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా కైకలూరు పంచాయతీ కార్యాలయంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ ప్రజల్లో వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించవలసిన అవసరముందన్నారు. సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడెం సత్యనారాయణ, సంఘ సభ్యులు బి. లక్ష్మణరావు, పి. పవన్‌కాంత్, డి. శివప్రసాద్, దుర్గాభవానీ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: వెట్టి విముక్త కార్మికుల పునరావాసానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని నూజివీడు సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ పెదఖాసిం అన్నారు. నూజివీడులో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు ఇంటిగ్రేటెడ్ బాయిస్ హాస్టల్లో అంతర్భాగంగా ఉన్న కాలేజ్ బాయిస్ హాస్టల్లో వెట్టి చాకిరీ నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరీని ప్రభుత్వం నిషేధించిందని, అలాంటి వారిని గుర్తించి పునరావాస ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు చట్టాలను విద్యార్థులకు వివరించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి రవిశంకర్, న్యాయవాదులు జేడీ గాంధీ, శ్యామ్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.



చేపూరులో ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్

రాష్ట్ర భవిష్యత్‌కు రానున్న ఎన్నికలు కీలకం

ముదినేపల్లి, ఫిబ్రవరి 9 : రాష్ట్ర భవిష్యత్తుకు రానున్న శాసనసభ ఎన్నికలు కీలకమని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. చేపూరులో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేవని, పోలవరం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. అభివృద్ధి చేయగల సత్తా ఉన్న నాయకులను ఎన్నుకోవాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, టీడీపీ నాయకులు యెర్నేని కిశోర్, చలసాని జగన్మోహన్‌రావు, కోడూరు శేషబాబు, కె. విఠల్, బొంగు రవికుమార్, పాతూరి నాని, పాతూరి వంశీ, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు బాసినశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపాలి: కామినేని

ముదినేపల్లి రూరల్: శుక్రవారం సంకర్షణపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కామినేని పాల్గొన్నారు. జగన్ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతూ ప్రతిపక్ష నాయకులపై అక్రమకేసులు బనాయిస్తూ రాక్షస పాలన సాగిస్తోందని, వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి ఎవరైనా కలిసికట్టుగా వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సింగరాయపాలెంలో ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.



విద్యుద్దీపాలంకరణలో

ముస్తాబైన శోభనగిరి

ప్రారంభమైన శోభనాచలేశుడి తిరునాళ్ళు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 9: ఆగిరిపల్లిలో కొలువైన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్లు, రథసప్తమి వేడుకలు ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి సుప్రభాత సేవలు, నిత్యకల్యాణాలు, ఊంజలసేవ, భజనలు, విశేష కార్యక్రమాలు జరుగుతాయి. పురాణాల ప్రకారం కృతయుగ మున శుభవ్రత మహారాజు శ్రీ మహావిష్ణువు గురించి తపస్సు చేయగా మహావిష్ణువు ప్రత్యక్షమై వరము కోరమని అడుగగా తాను పర్వతాకారం ధరిస్తానని, నీవు లక్ష్మీసమేతుడివై వేంచేయాలని ప్రార్థించగా శ్రీహరి అనుగ్రహించెను. అలా శుభవ్రతుడు శోభనగిరిగా శ్రీహరి వ్యాఘ్ర లక్ష్మీ నరసింహుడిగా ప్రసిద్ధులైరి. తిరునాళ్ళు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయి. 10న చంద్రప్రభ వాహనం, 11న హనుమంత, 12న అశ్వ, 13న గజ, 14న పెద్దశేషవాహనం, 15న గరుడోత్సవం, 16న రథసప్తమి, స్వామివారికి, గోదాదేవికి తిరుకల్యాణం, కల్పవృక్ష వాహనం, 17న దివ్య రథోత్సవం, 18న చినశేషవాహనం, 19న చినగరుడ వాహనం, 20వ తేదీ భీష్మ ఏకాదశి, యోగాంజనేయ స్వామివారికి పంచామృత స్నపన, రజత ఊయల ఉత్సవం, పుష్పయాగంతో ఈ రథసప్తమి వేడుకలు ముగుస్తాయని ఈవో ఎస్.భవానీ తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో 17న రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు.




శోభనగిరి (ఇన్‌సెట్) దేవేరులతో శోభనాచలేశ్వర స్వామివారు



రహదారి భద్రతపై చిత్రలేఖనం పోటీలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 9: రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని నూజివీడు బాలికోన్నత పాఠశాలలో రహదారి భద్రతపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. నూజివీడు ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు రహదారి భద్రతపై చిత్రాలను రూపొందించి ఆకట్టుకున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

ముసునూరు, ఫిబ్రవరి 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. శుక్రవారం గోపవరం, కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమెతో పాటు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎమిలి కుమారి, ఎస్సై వాసు, ఇతర అధికారులు పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, జంగం యోహాను తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీవో దిన తేజ్, పోలీసు అధికారులు శుక్రవారం పరిశీలించారు. పేట కలిదిండి, కోట కలిదిండి ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న సౌకర్యాలు పరిశీలించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నామని అధికారులు తెలిపారు. బీఎల్వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఎంపీడీవో గంగాధరరావు, ఎస్‌ఐ వెంకట్ కుమార్‌తో కలసి ముదినేపల్లి మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కోమర్రుతోపాటు పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే పాఠశాలలను పరిశీలించారు. పోలీసు బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐకి తహసీల్దార్ తెలిపారు. పాఠశాలల వద్ద మౌలిక సదుపాయాలపై ఎంపీడీవోతో చర్చించారు.

పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలి : డీఎస్పీ



కలిదిండి, ఫిబ్రవరి 9: పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించాలని డీఎస్పీ ఇ.శ్రీనివాసులు పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలిదిండి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గంజాయి, సారా విక్రేతలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా చూడాలన్నారు. ఎస్‌ఐ ప్రియకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



తూతూ మంత్రంగా మండల సమావేశం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 9: ఎంపీడీవో శామ్యూల్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. కాంట్రాక్టర్లు తమ బిల్లులు ఎప్పుడు వస్తాయని ఆతృతతో అడిగిన ప్రశ్నలకు అధికారులు ఖచ్చితమైన సమాధానం చెప్పలేకపోయారు. జల జీవన్ మిషన్‌లో పనులు చేస్తే డబ్బులు ఎలా వస్తాయని పలువురు ప్రశ్నలు సంధించారు. కంగారు పడవద్దని వీఆర్వో. 9 మంది సభ్యులతో బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాలని, ఆర్‌డబ్ల్యు ఎస్ నిధులు ఖాతాలోకి వస్తాయని, ఎన్నికల కోడ్ వచ్చినా విడతల వారీగా నిధులు జమవుతాయని అధికారులు తెలిపారు. అధికారులు ఎంత నమ్మబలికినా బిల్స్ ఎప్పుడు శాంక్షన్ అవుతాయనే సందేహం కాంట్రాక్టర్లను వీడలేదు.

బాబా ఆలయ వార్షికోత్సవం

రూ. 3 లక్షల నగ బహూకరణ.. భారీ అన్నసమారాధన



ముసునూరు, ఫిబ్రవరి 9: అక్కిరెడ్డిగూడెంలోని షిర్డి సాయిబాబా ఆలయ 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దీపక్ పాండే ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం కాగడహారతి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేయగా, ఆలయ చైర్మన్ పోలవరపు నరసింహారావు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మానుబోలు శ్రీమన్నా రాయణ, పద్మావతి దంపతులు రూ.3 లక్షల విలువగల బంగారు హారాన్ని సాయినాథుడికి సమర్పించారు. ఆళ్ళ సుధీర్, వెంకటమహాలక్ష్మి దంపతులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం గ్రామంలో బాబా పల్లకి సేవ నిర్వహించారు.

కాంగ్రెస్ టిక్కెట్‌కు మరీదు దరఖాస్తు

నూజివీడు, ఫిబ్రవరి 9: నూజివీడు నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున పోటీకి అవకాశం కల్పించాలని కోరుతూ నూజివీడు మాజీ ఎంపీపీ మరీదు కృష్ణ విజయవాడలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులకు దరఖాస్తు అందించారు. నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బీడీ రవికుమార్‌తో కలిసి వెళ్లి మరీదు కృష్ణ తన దరఖాస్తు అందించారు. నూజివీడు కాంగ్రెస్ నాయకులు సుంకర సుభాష్‌చంద్రబోస్, లింగమనేని కిషోర్, గోళ్ళపవన్ తదితరులు పాల్గొన్నారు.